పెద్దకథ

# ఆట

సర్వేపల్లి అపర్ణ

మా పరీక్షలు అయిపోయిన నాలుగవ రోజునే మాకు సెలవు లొచ్చేశాయి. సెలవ లెప్పుడూ వచ్చేవే! ఎప్పటిలాగానే సెలవులతో పాటూ కేరింత లొచ్చాయి.


కేకలూ, అరుపులూ మరీ మామూలు. వాళ్ళ లాగా వేసవి సెలవుల్లో ఏ విహారకేంద్రంలో కలవాలో ముందుగా ప్లాను వేసుకుని, చేతిలో చెయ్యి వేసి ప్రామిస్ చేయించుకునేంత దగ్గరి స్నేహితులు నా




కొక్కరూ లేరు. కొంచెం క్లోజు అని చెప్పదగ్గ అమ్మాయి కేరళలో ఉంది. ఫోన్లో పలకరిస్తుంటుంది నెల కోసారి. అయితే సెలవుల్లో వీళ్ళందరూ ఎంత బిజీగా ఉన్నా నన్ను చూసి ఆశ్చర్య పోవడం మాత్రం మరిచిపోరు. నేనూ అంతే! ఎంత నా ఆలోచనల్లో నే నున్నా చుట్టూ ఉన్న ఒకలాంటి చైతన్యం తట్టి పిలుస్తుంది. ఎన్ని సార్లు సెలవు లొచ్చినా అన్నిసార్లూ నా ఆశ్చర్యం,వాళ్ళ సంతోషం. అవెప్పుడూ డైరెక్టుల ప్రపోర్షనల్ అయితే, వాళ్ళలా చలాకీగా గంతులు వేస్తూ నే నేం చెయ్యాలో తెలీదు.

''సెలవుల్లో మీ రేం చేస్తారు?'' అన్న ప్రశ్నకు వాళ్ళోసారి నా వైపు వింతగా చూసి వూర్కొనుంటే ప్రశ్నే పాతబడి పోయేది. కానీ నా చుట్టూ గుండ్రంగా కూర్చుని వాళ్ళేం చేస్తారో చెప్పి, నే నేం చెయ్యాలో సలహా ఇచ్చేవారు. ఇప్పుడూ ఇస్తారు. అందుకే నే నేమీ అడగ దలుచుకో లేదు.మనసు తన పాటికి తను ఆశ్చర్యపోతూనే ఉంది. ఇది మాకు సెకండ్ • ఇయర్. మరో యేడాదిపాటు అందరూ కలిసి ఉంటారు కనక, వాళ్ళు మామూలుగానే ఉన్నారు. కానీ నాకు ఇంక చదవాలనిపించటం లేదు. అలాగని డిస్కంటిన్యూ చేసే స్థితిలో లేను. ఆస్తి అనే పదార్థం మా కున్నా, నాకు దాన్ని గురించి తెలిసిన దానికంటే తెలియందే ఎక్కువ. కనక అది న న్నెప్పుడైనా ఆదుకుంటుందన్న భరోసా లేదు.

మనసులో పుట్టి మనసులోనే చచ్చిపోయే మౌనం కూడా ఒకలాంటి భాషేనట. దాన్ని మాటల్లోకి అనువదించి మళ్ళీ నిశ్శబ్దంలో కరిగి పోకుండా కాగితం మీద పెట్టొచ్చు. అలా పెడితే కాగితంకూడా పలుకుతుంది. అలా పలికించే జర్నలిజం అంటే నాకు ఇష్టం. కానీ డిగ్రీఉంటే జర్నలిస్టు అయేందుకు కొంచెం అవకాశం ఎక్కువ. అందుకోసం చదవటం




తప్ప, మిగతా వాళ్ళ లాగా చదువుకు సంబంధించిన ప్లాన్స్ నా దగ్గర ఎక్కువ లేవు. అందుకే ఫైనల్ ఇయర్ ఇంట్లోనే ఉండి చదువుకోవాలని ఒక నిర్ణయం తీసుకున్నాను. ఇదేమిటని అడిగేవాళ్ళు లేనప్పుడు నేనేం చేసినా ఎవరి కాశ్చర్యం, నాకు తప్ప!

ఆంధ్రా నడిబొడ్డు నుండి పంజాబ్‌లో ఒక చిన్న పల్లెటూరికి నేను వెళ్ళి పోతున్నానని వాళ్ళెవరూ వూహించలేరు. నేను చెపితే తెలిసింది కనక ఆశ్చర్య పోతారు. ఆశ్చర్యపోయినా నేనింకెప్పటికీ వాళ్ళ మధ్యకు రాబోవటం లేదు అని మాత్రం అనుకోరు. ఎప్పటికైనా తెలుస్తుంది. అలా తెలిసిన రోజైనా 'ఈ పిల్ల మన కెప్పుడూ మిస్టరీయే!' అనుకుంటారు. బాధ పడరు. క్లాసులో అస్సలు గుర్తింపు లేని ఒక స్టూడెంట్ వెళ్ళిపోతే లెక్చరర్లు కూడా పెద్ద పట్టించుకోరు.

అసలు మనసు గురించి ఇన్ని మాట్లాడే నాకు నేనేమిటో సరిగ్గా తెలియదు. ఎవరికీ చెందనట్లుంటూనే ఎవ్వరికీ నేనే నక్కర్లేదని ఎందుకు విలవిల లాడతాను? నా గురించి, నా మనుషుల గురించి, వాళ్ళు మొదట్లో ఎన్నో అడిగేవాళ్ళు. అవన్నీ చెబుతుంటే నన్నూ వాళ్ళ ఫ్రెండ్‌గా గుర్తించే వాళ్ళేమో! కానీ నా గురించి నాకే తెలియనప్పుడు, వాళ్ళకేమని చెప్పేది?

"మీరు తెలుగు వాళ్ళయితే నువ్వు పంజాబ్‌లో ఎందుకుంటున్నావ్? అని ఒక ప్రశ్న. ఎందుకుంటున్నానో నాకు తెలిస్తేగా! అయినా, ఉంటున్నాను.

"మీ నాన్న ఫారిన్‌లో ఉంటే నువ్విక్కడ, మీ తమ్ముడు రిషివేలీలో. అదేమిటి?" ఏమిటో తెలీదు. కానీ అడంతే.

"కక్కీ అంటే మీ అమ్మ చెల్లెలా?"

"కాదు."

"మామ అంటే మీ అమ్మకు."

"అస్సలు కాదు!"

"మీ అమ్మ ఫారెనర్ అయితే నువ్విలా ఉండవేం?"

ఇది అన్నిటికంటే పిచ్చి ప్రశ్న. అంటే అర్థం ప్రశ్న పిచ్చిదని కాదు. నాకు పిచ్చెక్కించే ప్రశ్న అని. అసలు ఇవన్నీ ఎవరో నన్నడిగిన ప్రశ్నలు కాదు. ఎవ ర్నడుగాలో తెలీక నేనే వేసుకున్న ప్రశ్నలు.

మమ్మల్ని ఎవరి పంచనో వదిలేసి మా నాన్న అలా దేశాలెందుకు తిరుగుతారో తెలీదు. ఆయన మిలటరీలో ఉన్నప్పుడు మెడికల్ ఆఫీసర్. ఇప్పుడు ప్రైవేట్ ప్రాక్టీస్‌తో పాటూ ఫ్రెండ్స్‌తో ఏదో పార్ట్‌నర్‌షిప్ బిజినెస్. మిలటరీలో ఉన్నప్పుడు ఆయన సర్వీసంతా నార్త్‌లోనే గడిచి పోయింది. తెలుగు నేలమీద మా నాన్నగారి తాతలు పుట్టిన గడ్డ ఏదో నాకే కాదు—ఆయనకూ తెలీదట.

సంవత్సరానికి ఒకసారి నా పేరు మీద డ్రాఫ్టు వస్తూ ఉంటుంది. మూడు లేక నాలుగు వేల డాలర్లకు. నేనే దాన్ని కాష్ చేసుకుని మా ఖర్చులకు వాడి, మిగిలింది అదే బాంక్‌లో వేస్తుంటాను. ఆ బాలెన్స్ కొంత ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మార్చాను తమ్ముడి పేరు మీద. ఎందుకంటే ఈ డబ్బు నేనెప్పుడైనా అత్యవసరమైతే వాడుకోవచ్చో, లేదో తెలియదు. నేను మా నాన్నను ఫోటోలో తప్ప ముఖాముఖీ చూడలేదు. డబ్బు పంపేటప్పుడు అదే కవర్‌లో ఒక చిన్న నోట్ ఉంటుంది. బ్లెస్సింగ్స్ అందజేస్తూ, బాగా చదువుకొమ్మన్న అభ్యర్థన మాత్రం ఉంటుం దందులో. మా తమ్ముణ్ణి చూస్తే చాలామంది ఫారెనర్ అనుకుంటారు. కనక వాడే మా నాన్నకు అసలైన కొడుకు అనుకుంటాను అప్పుడప్పుడూ. వాడిది మరీ చిత్రమైన మనస్తత్వం. ఎందుకు నవ్వుతాడో, ఎందుకు కోపగించుకోడో వాడిక్కూడా సరిగ్గా తెలియదని నా అభిప్రాయం.

మొత్తానికి మా సంబంధం ఫారెన్ అక్కా తమ్ముళ్ళ మాదిరిగానే ఉంటుంది. అయితే, నాలా కాకుండా వాడు ఒంటరితనాన్ని అలవాటు చేసుకున్నాడు.

మా కక్కీకి వారంలో కనీసం రెండు సార్లయినా తను దిక్కులేనిదానినని అనిపిస్తుంది. అలా అనిపించినప్పుడల్లా నన్ను పట్టుకొని వెక్కిళ్ళు పెడుతుంది. "నువ్వేడవ వేమిటి? నన్ను చూస్తే నీకూ జాలి లేదు" అని భోరుమంటే, "నాకు కన్నీళ్ళు తొందరగా రావు" అని చెప్పేదాన్ని.


ఆమెకు తెలుగు బాగానే వచ్చు. కానీ తను పంజాబీ ఆడపడుచునని రోజుకు పాతికసార్లయినా గుర్తు చేస్తుంది. ఆమె ఏం చేసినా బాగుంటుంది నాకు. గొప్ప అందగత్తె అని చెప్పొచ్చు. ఎప్పుడైనా అదే మాటంటే—"ఏం చేసుకోను ఈ అందం! మీ పప్పా మనందర్నీ దిక్కులేని వాళ్ళను చేసి పోతే" అనేది అర్థంలేకుండా. కానీ అక్కడ ఉన్న ఆ పెద్ద ఇల్లు నాన్నదేనని అందరికీ తెలుసు. అలాగే ఏభై ఎకరాల పొలం కూడా కక్కీ పేరుమీదున్నా, అదీ నాన్నదేనట.

నిజానికి ఈ మామకూ మాకూ ఉన్న బంధుత్వం ఏమిటో నా కెంతమాత్రం తెలీదు. వూర్లో వాళ్ళు నవ్వుకునేదాన్నిబట్టి ఆమే ఆయన్ని ఉంచుకుంది. ఆమెకంటే అయిదేళ్ళు చిన్నవాడు. ఒకే ఇంట్లో భార్యా భర్తల్లా కలిసి ఉంటూ అన్నా చెల్లెళ్ళమని నమ్మించేందుకు అన్నిపాట్లూ పడుతుంటారు. మామాజీ కూడా వెర్రిబాగులవాడేం కాదు. ఈవిడకు "నువ్వు లేకుండా బతకలేను బిమ్లా" అంటూ మాటలు చెప్తూనే వీలైనంత మందితో ప్రేమాయణం నడుపుతాడు.

ఎప్పుడు సెలవులకు ఇంటికి వెళ్ళినా వీళ్ళ ఏడుపులూ, పెడబొబ్బలూ బాగా కాలక్షేపం! సాధారణంగా ఆవిడే ఆయనను తన్నే వరకూ వెళ్తుంది. ఒకటి రెండు సార్లు తంతానని బెదిరించబోయి బాధ వదిలింది. ఏం చేసినా ఆయన అట్టే చలించడు. అలా అభిమానపడితే తన ముప్పై ఎకరాల పొలం ఖర్చూ మా డబ్బుతో సర్దుబాటు చేసుకునే వీలు పోతుందని ఆయనకు బాగా తెలుసు. ఎప్పుడైనా కక్కీ ఇంట్లో లేదనిపిస్తే, గుండె మరిగిపోతున్నట్లు పొలికేకలు పెడ్తాడు, పాలు తీసేవాళ్ళూ లోగిలి వూడ్చేవాళ్ళూ వినేట్లు—"అసలీ ఆడజాతి నీతీ, విశ్వాసం అనేవే లేవండీ! నేనుండగా అంతమందితో ఆవిడకు పొత్తెందుకు? నేను దిక్కులేని వెధవననేగా ఆవిడకు అలుసు! నాలుగుసార్లు బతిమాలుకుంటే అప్పుడెప్పుడో వదిలేసిన నా భార్య నన్నేలుకోదనా? ఏదో ఈవిడను నట్టేట్లో ముంచి పోవడ మెందుకనే కదా నేను మంచిగా వూరుకునేది." ఇంతే! ఈ పాటే వీలైనన్ని సార్లు పాడతాడు ఆమె వినకుండా!

అసలు చావంతా పనివాళ్ళకే. గోడలచాటుకూ, చెట్ల కిందకూ పరుగెడతారు నవ్వు బిగబట్టుకుంటూ. అలా కాట్లాడుకుంటూనే వాళ్ళు కలిసి ఉంటారు.

ఎప్పుడో కక్కీనే చెప్పిం దనుకుంటా—మామాజీ మా నాన్న ఫ్రెండు తమ్ముడని. కానీ, ఈవిడెవరో ఈమె నోటి నుంచి వినడమే తప్ప మా డాడీ మాకెప్పుడూ చెప్పలేదు. 'నువ్వు మా కేమవుతావు, కక్కీ' అంటే, అది చెప్పకుండా—'మీ నాన్న నాకు బెస్ట్ ఫ్రెండ్' అంటుంది. 'నీ కన్నేళ్ళు?' అన్నాను ఒకసారి. 'యాభై మూడు' అని చెప్పింది. 'మరి మా నాన్నకు నలభై తొమ్మిదేగా' అంటే—'నాకంటే చిన్నవాడైనంత మాత్రాన స్నేహం చేయకూడదా? ఏముందని మీ నాన్న ఆ ఎర్రజుట్టువిడ్ని నాలుగేళ్ళ





పెద్దదైనా చేసుకున్నాడు? తగ్గట్లే ఆమె దగా చేసింది. ఆరేళ్ళు కలిసి ఉన్నారట. తర్వాత విడాకులు. మరో రెండేళ్ళకు ఆవిడ మరొకర్ని పెళ్ళి చేసుకుని కాన్పులో చచ్చిపోయింది. "అని వెక్కివెక్కి ఏడ్చింది.

'నువ్వెందుకు ఏడుస్తావ్?' అని అడిగితే—"ఆమె చాలా మంచిదట! మీ నాన్న ఆమెను ఇప్పటికీ మరిచి పోలేక పిచ్చి పిచ్చిగా తిరుగుతున్నారు" అని చెప్పింది, "మరి ఆమె దగా చేసిం దన్నావేం?" అంటే. "అదంతే లేవే! అయినా ఫిన్నిష్ లేడీ అయి ఉండి అంతగా ప్రేమించిందంటే ... చాలా గొప్పవిషయం. ఎలా విరిచేశాడో ఆ అమ్మాయి మనసు. మీ నాన్న ఉత్త కర్కోటకుడు" అంది. కక్కీకి అలా క్షణానికి కొక రకంగా మాట్లాడటం ఎలా అలవాటో, అలాగే నాకూ ఆ రకరకాల మాటల్లోంచి ఒక నచ్చిన నిజాన్ని ఏరుకోవడమూ అలవాటు. అయితే సాధారణంగా ఆమె మాటల్లో నిజాలున్నా, అవి నచ్చేలా ఉండవు. ఇలాంటి మాటల్లోనే ఒక సారి "నువ్వేం చదువు కున్నావ్, కక్కీ?" అని అడిగాను.

"చదువుకోలే దనేలే మా చెల్లిని చేసుకోనన్నాడు మీ నాన్న అప్పట్లో! దాని మొగుడూ, మీ నాన్నా ప్రాణస్నేహితులు. అలాగే పరిచయం ఆయన మా ఇంటికి. మా ఆయన చనిపోయాక ఫూరికే ఏడుస్తూ కూర్చుంటే, వచ్చి ఓదార్పుగా ఏవేవో చెప్పేవాడు. ఆయన పోరు పెడ్తేనే కదా బియ్యేకు కట్టి నలభై య్యవ ఏట డిగ్రీ పుచ్చుకున్నాను." చెప్పింది ఏవేవో గుర్తుకు తెచ్చుకుంటూ!

గుండె ఇష్టమొచ్చినట్లు కొట్టుకుంటూంటే అప్పుడే అడిగాను—"మా అమ్మెవరు? నీకు తెలిసే ఉంటుంది. చెప్పు, కక్కీ" అని. అప్పటికే ఆమె కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేశాయి. నన్ను దగ్గరకు లాక్కుంది. "ఏం చెప్పేది? నువ్వెప్పుడూ ఇదే ఆలోచిస్తావు కదు డాలీ! నువ్వు తెలుగు పిల్లవు. మీ నాన్నదీ అదే నేల. వాళ్ళింట్లో చాలా వరకు ఆర్మీకి, నేవీకి అంకిత మయ్యారు కనుక కావాలనే పుట్టిన వూరొదిలేసి ఇలా వచ్చేశారు. కానీ ఆ దేశం అంటే అభిమానం మాత్రం అలా వచ్చేశాక రెండింతలైంది. అందుకే మిమ్మల్ని సౌత్‌లో ఉంచి మీ నాన్న చదివించడం. ఇరవై ఏళ్ళప్పుడే అక్క కూతుర్ని చేసుకున్నానని చెప్పేవాడు. ఆ అమ్మాయి కూతురివే నువ్వు. అని మీ నాన్న తన నోటితో ఎప్పుడూ చెప్పలేదు. మేం అనుకునేవాళ్ళం అలాగ. మీ అమ్మమ్మకూడా ఢిల్లీలోనే ఉంటున్నారు.

అయినా వాళ్ళెందుకో నిన్ను దగ్గిరికి తియ్యాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇంతకంటే నా కేం తెలీదు! నా మీద నమ్మకం కొద్దీ మీ నాన్న తన పిల్లల్ని నా చేతిలో పెట్టి తన దారి తాను చూసుకున్నాడు. మా మధ్య అసలేం బాంధవ్యం ఉందని? తమ్ముళ్ళు లేని కొరత తీర్చాడు. నా పిల్లలకు నువ్వే దిక్కంటూ నాకు ఒక దిక్కు చూపించాడు." అంతా విన్నాను. పిచ్చి పట్టినట్లు నవ్వాలనిపించింది. అసలు ఈయనే నాకు నాన్న అని మాత్రం గారంటీ ఏమిటి? అదే పైకి అరిచాను. "నాకు మీ రందరంటే అసహ్యం. మా నాన్న ఒక రాక్షసుడు. చాలామంది జీవితాలు నాశనం చేశాడు. నా కెవరూ లేరసలు! ఆయన నాకు నాన్నే కాదు." ఇంకా ఏవేవో ఇలాగే

ఆమె పెద్దగా ఏడ్చేసింది. నాన్న దేవుడు కాకున్నా రాక్షసుడు కాదుట. ఎదురు దెబ్బలు ఆయనకూ చాలా ఉన్నాయట. కానీ కక్కీ ఎందుకలా ఆయనను తిడుతూనే సమర్థిస్తుందో ఎంత ఆలోచించినా అర్థం కాదు.


వూళ్ళో వాళ్ళందరికీ తను మా కోసమే బతుకు తున్నట్లుగా మాట్లాడుతుంది. యాభై ఏళ్ళు దాటినా ముప్పై మించని దానిలా కనిపిస్తుంది. అందుకే ఆమెను నిజంగానే మా అమ్మ చెల్లె లనుకుంటారు. ఇంతే మా మధ్య ఉన్న సంబంధం. నే నింట్లో అడుగు పెట్టినప్పటి నుండి మామ ఎన్ని రకాలుగా దగా చేయబోయిందీ చెబుతుంది. వీలైనన్ని సార్లు ఏడుస్తుంది. తను దిక్కులేని దైపోయిందని గోల పెడుతుంది. ఇవన్నీ అయాక ఇంకా కసి తీరక పోతే—"నిన్నూ, నీ తమ్ముణ్ణీ నా ఖర్మ కొదిలేసి మీ నాన్న నా కన్యాయం చేశాడు" అని అరిచి కేకలు పెడుతుంది. ఒకటి రెండు సార్లు అది విని తమ్ముడు ఆ తరవాత సెలవులకు రావటం అసలు మానేశాడు. నాకు ఉత్తరం మాత్రం రాశాడు—"ఆ పల్లెటూర్లో ప్రశాంతత ఉన్నా, కక్కీ వలన ఆ ఇంటి పరిసరాల్లో నేను ఉండలేక పోతున్నాను. నీ కిష్టమైతే నువ్వు వెళ్ళిపో! నన్ను గురించి ఏమడిగినా చెప్పకు" అని.

గుండె నెవరో నొక్కి పట్టినట్టైంది అది చదివాక. నిజంగా — ఆవిడ కాదు. మేమూ అనాథలం అనిపించింది. కానీ ఎవరితో చెప్పుకోను? వాడు ఎంత మవునిలా ఉన్నా ఇద్దరు ముగ్గురు మంచి ఫ్రెండ్సు ఉన్నారు. నా కంటే అదృష్టవంతుడు. సెలవు లన్నీ వాళ్ళతోనే గడిపేసేవాడు. వాడికి డబ్బుకు ఏ మాత్రం కొదవలేదు. వేలు ఖర్చు పెట్టినా అడిగే దిక్కు లేదు. కానీ నా పరిస్థితి వేరు. నాన్నకు నా మీ దెందుకో ఏ మాత్రం అభిమానం లేదనిపించేది. అది కక్కీ మాటల వలన తెలిసిందో, లేక మరొకటో నేను చెప్పలేను. కానీ, అలాంటి నాన్న డబ్బు చదువుకు ఖర్చు పెట్టుకుంటుంటేనే ఎలాగో ఉండేది. అందుకే నా కంటూ బాంక్ ఖాతాలో అయిదు రూపాయలు కూడా ఉంచుకోలేదు.

మా డబ్బుతో బతుకుతూ మా మీద అజ మాయిషీ చలాయిస్తున్నా కక్కీకి మేమంటే అయిష్టం ఎందుకో నా కర్థమవదు. నాన్నంటే ఆ వూళ్ళో చాలా మందికి గౌరవం. ఆయన పిల్లలుగా మమ్మల్నీ అభిమానిస్తారు. కేవలం అందుకే ఆమె అందరి ముందూ మా మీద తనకున్న ఆప్యాయత ఎంతో వివరంగా కథ లల్లి చెబుతుంటుంది. నిజానికి ఆమె మమ్మల్ని చేరదీసి లాలించిన క్షణం అంటూ లేదు. ఆమె గంటల కొద్దీ నా ముందు కూర్చుని ఏడ్చినా, అలా కార్చేవన్నీ నిజం కన్నీళ్ళే అయినా నా కెందుకో అదంతా కృత్రిమంగా అనిపిస్తుంది. నన్ను, నాన్నను తలుచుకుని వల వల ఏడిచే బదులు మా కింతలో లక్షో వంతు ఆప్యాయత చూపించ కూడదా అనికూడా అనుకుంటూంటాను.

నన్ను తిట్టి అన్నం తినకుండా తను ఏడవటం నన్ను శాపనార్థాలు పెట్టి తనను తాను తిట్టుకోవటం ఇవి అతి సాధారణంగా జరిగే విషయాలు. తనకు నా మీద ప్రేమ లేదని నాకు తెలుసు. తనను గురించి నే నేమనుకుంటానో ఆమెకు తెలుసు. ఇదంతా తెలిసినా "నా నోరు మాత్రమే అందరూ వింటారు, డాలీ! నువ్వు మాత్రం కక్కీకి నే నంటే ప్రేమ లేదనుకోకు. నేను బతికేదే నీ కోసం!" అంటుంది. ఇదంతా ఒక నాటకమైతే, నా కిష్టం లేకున్నా నా పాత్రను నేను పోషించాలి. లేదంటే నాటకం నిజం అవుతుంది. నిజం మరీ చేదుగా ఉంటుంది. అందుకే ఏడవాలని పిస్తున్నప్పుడు నవ్వు, నవ్వు వస్తున్నప్పుడు వెక్కిళ్ళు, కన్నీళ్ళు. ఇంతకు మించి నా జీవితానికి పరమార్థం లేదు.

అయితే ఈ సారి సెలవలకు వెళ్ళడం తరవాత తిరిగి హాస్టల్‌కు రావడం అంటూ జరగకూడదని నా నిర్ణయం. ఈ భావంతో ఇంకా నీరస మొస్తోంది. నాకు గుర్తున్నంత వరకు నాన్న వైపు బంధువు




లెవరూ లేరు. అమ్మెవరో—అసలు అమ్మ లెంతమందో తెలీదు కనక వాళ్ళ చుట్టాల గొడవేలేదు. కక్కీ మాత్రమే ఒంటరితనం భరించలేక అప్పుడప్పుడూ పార్టీలు ఇస్తూ ఉంటుంది. వాటికి ఆవిడ ఫ్రెండ్సు, ఫూళ్ళో పెద్ద మనుషులు మాత్రమే వస్తారు. సంవత్సరాని కొకసారి నా పుట్టిన రోజంటూ చేస్తుంది. నేనా వూళ్ళో ఉండనక్కర లేదు. ఫంక్షన్ జరిగిపోతుంది. మరో వారానికి వాసన కొడుతూ కేక్‌పార్సిల్ నా కందుతుంది. ఈవిషయంలో నా కంటే దవుర్భాగ్యుడు రాహుల్. వాడి కిలాంటివేవీ జరగవు. ఆ వూర్లో మాది ఉన్నత వర్గానికి చెందిన కుటుంబం అనే చెప్పాలి. పంజాబ్ చాలా సంపన్నమైన రాష్ట్రం. మా లాంటి ఉన్నత వర్గానికి కొదవ లేదు ఆ వూళ్ళో. అయినా మా గుర్తింపు మా కుంది. ముఖ్యంగా, నేనూ, రాహుల్ ఆ కుటుంబంలోని వింత సభ్యుల్లో ఒక భాగం కనక. ఘరానా ఇండ్లలో జరిగే చాలా పనులు పెద్దవాళ్ళకు వింతగా ఉండవు. కాని కక్కీ అంటుండే ముతకజనం మాత్రం వీళ్ళను నీతిలేని మనుషులు అంటుంటారు. ఆవిడ కదే కడుపు మంట.

"నే నెవరితో ఉంటేనేం? పిల్లల బాధ్యత మరిచి పోయానా?" అంటుంది. ఎవరి సన్న మాటకైనా ఆవిడే భుజాలు తడుముకోవటంలో మరి కాస్త అలుసుగా అంటూ రామెను. అందుకే ఆ వూర్లో నే నొచ్చానని ఎవరైనా పలకరించేందుకు వచ్చినా—"ఇప్పుడు నీరజ ఖాళీగా లేదని చెప్పు" అని పని వాళ్ళతో చెప్పి పంపేస్తుంది. కానీ బాగా ఆలోచిస్తే ఆవిడ కోపానికి వెనక అక్కసు లాంటి దుందేమో ననిపిస్తుంది. ఎందుకంటే తన పేరుమీద లక్షల ఆస్తి ఉన్నా, ఆర్థికంగా తను అంత స్వతంత్రురాలైనా ధావన్‌జీ (మామాజీ) ని కట్టి పెట్టేసుకోలేక పోయిం దావిడ. ఆయన ఆవిడ నెదిరించి మాట్లాడ కున్నా చేసేవేవో సద్దు లేకుండా వెనక చేసేస్తుంటాడు. ఇదంతా ఆమెకు తెలిసినా ఏమీ చేయలేదు. మహా అయితే మరో ముగ్గురిని తన ఇంటికి రమ్మన గలదు. ఇంత చేసినా ధావన్‌జీ పెద్దగా ఉలిక్కిపడరు.

అలాంటప్పుడే "వీడేం మగాడు!" అంటుంది కక్కీ.

"ఆయన కులందాన్ని కాదనలే ఆయనకు నేనంటే చిన్నచూపు. ఆయన అసలు పేరు ఎవరికైనా తెలిసి చచ్చిందటే! ఆయన కులంపేరు అందరికీఅంత పరిచయం మరి. మనమేం చేస్తాం?" ఇదంతా కోపం వెళ్ళగ్రక్కటం. అసలు ధావన్ జీకి ఇవన్నీ తిట్లకింద లెక్కలోకి రావు. ఆవిడచేత తన్నులు తింటే గానీ ఆయనకు ఆనదు.

ఈ మాటలు కూడా అంటుంది కక్కీ "ఆరడు గులభారీ శాల్తీ. అయినా ఏం ప్రయోజనం? ఉత్సవ విగ్రహంలా కదలిక అంటూ ఉంటుందా?"

అవి కూడా ఆయన చెవిదాకా వెళ్ళవు.

"బాబూజీ ఎంతెత్తు విగ్రహమో, అంతే ఎత్తు విగ్రహం!" అని ఒకసారి మా పాలవాడు ధావన్‌జీని మైమరచి చూస్తూ, కాసేపు కక్కీ సంగతి మరిచి పోతే వాడి చేతిలో చెంబునే లాక్కుని కొట్టింది. అయినా ఇలాంటి కాంప్లిమెంట్సుకూ మామాజీ చెదరరు.

ఏ రకంగానూ బయట పడకున్నా ఆయనకూ కక్కీ అంటే మోహం మొత్తిందని ఈ మధ్యే నా కర్థమైంది. ఆ విషయం కక్కీ గగ్గోలుపెడుతూ రాశాక, ఆయన తొందరలోనే వాళ్ళ కులం అమ్మాయిని పెళ్ళి చేసుకో బోతున్నారనీ, ఆ తర్వాత మా పొలాలు మా ఖర్మకే వదిలేస్తారనీ తెలిసింది. పంజాబ్ లోని అతి పేదకుటుంబంలో ఒక అమ్మాయి పెళ్ళి అదే స్థాయికి చెందిన అబ్బాయితో జరగాలంటే కనీసం పదివేలు ఖర్చవుతుంది. అలాంటిది ముప్పై ఎకరాలున్న శాల్తీ, ఎంత యాభైకి దగ్గర ఉన్న వాడైనా, పైసా ఖర్చు కూడా వద్దంటూ తమ కూతుర్ని చేసుకుంటామంటే ఎవరు ముందుకురారు?. ఇంకా ధావన్‌జీ కొంత నీతిగానే ఉన్నారనవచ్చు. మరీ పదిహేను నిండిన అమ్మాయి కావాలనక ముప్పై నిండిన అమ్మాయినే సెలెక్ట్ చేసుకున్నారు.

కక్కీ నెందు కసలు ఓదార్చాలో తెలియలేదు. అలాగని ఏ కారణం లేకుండానే గంటల తరబడి ఏడవ గలిగే ఆవిడకు, ఇది జరిగాక నేను ఏం చేస్తే ఓదార్పు కలుగుతుందో ఇప్పట్నించే ఆలోచించకపోతే లాభం లేదు. ప్రస్తుతం నేను ఆలోచిస్తున్నదదే! రాహుల్‌కు ఈ సంవత్సరంతో పదో తరగతి అయి పోతుంది. వాడిని ఫారిన్‌లో పై చదువు చదివించాలని మా నాన్న కోరిక. అంటే వాడు మరో నెల రోజుల్లో విమానం ఎక్కుతాడు. అడిగితే నన్నూ రమ్మంటా రేమో! కానీ చిన్న జైలునుంచి పెద్ద జైలుకు పోవడం నా కిష్టంలేదు. అదైనా అడగ నప్పుడు దేబిరించుకుని పోకపోతేనేం? ఇక్కడ ఏడుపో, తిట్లో కక్కీ కనీసం పలకరిస్తుంది. అక్క డెవరున్నా రసలు? ఎలాగూ ఇంకొక సంవత్సరం చదువుంది. ఆ తర్వాత ఎంతో ఇష్టమైన కోర్స్‌చేయాలన్న అభిలాష ఉంది. ఇంతకంటే ఎక్కువ ఆలోచించగల స్థితిలో లేను.


• • • •

ప్రతి సారి కంటే ఈ సారి మరీ మూడీగా ఉన్నా నేమో, నా క్లాస్‌మేట్స్ నా చుట్టూ మూగారు. సునీత అనే అమ్మాయి అడిగింది "ఎందుకు నీరజా, అలా ఉన్నావ్? ఆరోగ్యం బాగాలేదా?' అని. కాదు అన్నాను. మరింకేమిటని అందరూ తరచి తరచి అడిగారు. ఏం చెప్పుకోవాలి వీళ్ళకు? గుండె నీరయేంత వరకూ ఏడావా లనిపించింది. కన్నీళ్ళన్నీ గుండెలో చేరినట్లుంది. అవన్నీ ఇగిరిపోయేవరకు గుండె ఇలాగే బరువుగా ఉంటుందేమో ననిపించింది. సిల్లీగా అనిపించిన ఆలోచనకి నవ్వాను. నేను నవ్వానని వాళ్ళూ నవ్వారు. "నా నిక్ నేమ్ నింబస్ అని పెట్టారు కదూ మీరు! కానీ నాకు కన్నీళ్ళు అంత సులభంగా రావు. అందుకే ఎప్పుడూ బరువుగా ఉంటాయి నా ఆలోచనలు" అన్నాను. వాళ్ళలో చాలా మంది ఉలిక్కిపడ్డారు. తర్వాత 'సారీ' చెప్పుకోవాలని ప్రయత్నించారు. కానీ నేనే వద్దన్నాను.

"నా మూడీనెస్ వలన మీకు కొంత కాలక్షేపం అయి ఉంటే అందుకు నేను నిజంగా సంతోష పడతాను" అన్నాను. అంతే! అంతకుమించి మరేం చెప్పలేదు.

నా బట్టలూ, మిగతా వస్తువులూ, పుస్తకాలూ వాళ్ళే సర్దారు. వాళ్ళెవరూ ఆ రాత్రి నిద్ర పోలేదు. ఏవేవో మాట్లాడుకుంటూనే ఉన్నారు. నేను పక్క కూడా పరుచుకోకుండా అలాగే నేలమీద నిద్ర పోయాను. మరునటి రోజు ఎవరి దారుల్లో వాళ్ళు బయల్దేరాము. నేను తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వరకు వచ్చి, అక్కడి నుండి జలంధర్‌కు బస్‌లో వెళ్ళాను. నాన్న నెప్పుడూ చూడనినేను, అక్కడ మిలిటరీ హాస్పిటల్‌లో డాక్టరుగా పనిచేస్తున్న నాన్న ఫ్రెండ్‌ను చూడటానికి వెళ్ళాను.

ప్రతి సంవత్సరం అలా వెళ్ళడం అలవాటు. ఆయనకు పిల్లల్లేరు. నేను మూడేళ్ళ పాపగా ఆయన దగ్గర పెరుగుతున్నప్పుడే, నాన్న కోరిక మీద కక్కీ దగ్గరకు చేర్చారట నన్ను. ఈ అంకుల్ ద్వారాకూడా నాన్నకు సంబంధించిన విషయాలు మాకు కొంచెం తెలుస్తుంటాయి. ఆయన ఒకసారెప్పుడో అన్నారు: "నువ్వు మీ డాడీని అసహ్యించుకుంటావని తెలుసు




నీరజా! కానీ మీ అమ్మ నిన్ను కని చనిపోయిందట. రాహుల్ తల్లి వాణ్ణి కన్నాక మీ నాన్నను వదిలేసింది. ఇదే ముఖ్యకారణం వాడు పిల్లలంటే ఇష్టపడక పోయేందుకు. ఇంకా వాడు చాలా దెబ్బతిన్నాడు జీవితంలో." అలా అని ఆయన నిట్టూర్చారు. గుండె ఒక్కసారి మండినట్లయింది.

"అలా జీవితాలతో ఆటలాడింది ఆయనే, అంకుల్! కావాలనే ఆటలాడి ఎదురు దెబ్బలు తగిలాయంటే ఎవరేం చెయ్యగలరు?" అన్నాను.

ఆయన నవ్వారు. "నువ్వన్నది నిజమే నమ్మా! వాడు అలా పిల్లల్ని ద్వేషించడం మంచి పని అని తల మాసిన వాడెవడూ చెప్పడు. కానీ వాడు దాదాపు పిచ్చివాడిలా బతుకుతున్నాడు, మున్నీ! నువ్వు కాసేపు వాడు నీకు నాన్న అని మరిచిపో! అప్పుడు కొంచెం జాలివేస్తుంది."

'నాకేం వెయ్యదు' అనాలనిపించింది. అసలీ ముసుగులాటంతా ఎందుకో అర్థం కాదు. మేముండగా ఎవరూ లేరని పిచ్చెక్కించుకొని, మమ్మల్ని క్షోభ పెట్టడం ఎందుకు? మేమూ ఆక్రోశిస్తున్నది నాన్న ప్రేమ కావాలనే. ఆయన్ను కావాలంటే ఎంతగానైనా ప్రేమించగలం. మా గోడెవరూ వినరేం?

అదయిపోయింది. అయినా వెళ్ళిన ప్రతిసారీ ఆయన ఇలాంటి మాటలు కొన్నయినా చెప్తారు. వో గంట సేపు అవీ ఇవీ మాట్లాడాక "నే నింక వెళ్తాను" అన్నాను. అప్పుడన్నారు: "నువ్వూ స్టేట్స్ వెళ్ళిపోతావా రాహుల్‌తో" అని. లేదన్నాను.

ఆ తర్వాత డైరెక్ట్ 'బస్'లో సాల్వాకు వచ్చేశాను. గేట్ తెరచి లోపలికి వెళ్తుంటే ఇల్లంతా ప్రశాంతంగా ఉన్నట్లు అనిపించింది. కొంచెం ఆశ్చర్యపోయాను. కక్కీ లోపల గదులన్నీ కడిగిస్తోంది పని వాళ్ళతో. అందుకు కాదు ఆశ్చర్యం. చెప్పిన తేదీకంటే ఒక రోజు ముందే వచ్చేశానని అప్పటికి గానీ గుర్తు రాలేదు. చూసినవెంటనే నన్ను చుట్టేసి ఏడుస్తుం దనుకున్నాను. అలాంటి దేమీ జరగలేదు. ఎందుకో రాహుల్ గుర్తొచ్చాడు.

సూట్‌కేస్ అందుకుంటూ "మళ్ళీ ఎప్పుడు కాలేజీ తెరవడం?" అంది. ఎప్పుడూ అడగని ఆవిడ ఈ సారి అలా అడిగితే నవ్వొచ్చింది. "ఎప్పుడు తెరిచినా నేను వెళ్ళను కక్కీ! ఇంటి దగ్గరే ఉండి ఫైనల్ ఇయర్ పూర్తి చేయా లనుకుంటున్నాను" అన్నాను.

"చాలా మంచిపని చేశావ్! వో బోడి డిగ్రీకోసం అంత చావా?" అంది.

ప్రక్కరోజు టీ తాగుతూ ఆలోచిస్తున్నాను— ధావన్‌జీ ప్రసక్తి తెస్తుందేమో ఏం మాట్లాడాలా అని. అప్పుడంది కక్కీ "పింకీ ( రాహుల్ ) కి ఈ సంవత్సరంతో అయిపోయినట్లేగా చదువు" అని.

పెద్దగా నవ్వాను. "గ్రాడ్యుయేట్ వయి ఉండి చదువురాని దాన్లా మాట్లాడతా వేంటమ్మా?" అంటే, తనూ నవ్వేసింది. సాధారణంగా అలా చెయ్యదు కక్కీ. పూర్ణో వాళ్ళనో, ధావన్‌జీనో ఏడిపించినప్పుడు మాత్రమే నవ్వుతుం దావిడ. మరొకరితో కలిసి నవ్వటం ఆమె విషయంలో అసాధారణమే దాదాపు! కక్కీ మారిపోయింది అనిపించింది.

ఎందుకో ఎగిరి గంతులు వేయాలన్నంత సంతోషం వేసింది. కానీ కక్కీ నన్ను వింతగా చూస్తోంది. మరో నిమిషం తర్వాత మామూలుగా అయి నాతో అంది—

"డాలీ! నువ్వు జీవితంలో ఎవర్నయినా నమ్ము! కానీ మగవాడి జోలికి మాత్రం పోకు. వాడు పుట్టిందే దగా చేసేందుకు. అలా దగా చెయ్యక పోతే వాడు మగాడేకాదు" అలా అనేసి చేతుల్లో దాచుకుంది ముఖాన్ని.

"కక్కీ! ఆయన లా చేసినందుకు బాధపడుతున్నావా?" అన్నాను. నన్ను దగ్గరికి రమ్మని పిలిచింది. వెళ్ళి ఆమె ప్రక్కనున్న సోఫాలో కూర్చున్నాను. వెంటనే నేల మీదకు జారినా ఒళ్ళో మొహం పెట్టి అంది: "నువ్వుత్త పిచ్చి దానివి, నీరూ! వాడెవడు నన్ను కాదని పోయేందుకు? గొర్రె కసాయి వాణ్ణి నమ్మినట్లు నేనీ మగ పురుషులను నమ్మానేమిటా అనే బాధపడతాను. పప్పా మన కందరికీ కొరతలేకుండా ఇంత ఆస్తి వదిలి వెళ్ళింది ఎందుకు? మీరు సంతోషంగా ఉండాలి. కానీ నేను పాపాత్మురాలనే ..." ఈ మాటలన్నీ అంటుంటే కక్కీ గొంతు వణుకుతోంది. అదంతా ముందు చేసిన తప్పులకు పశ్చాత్తాప పడటమే అయితే, నా వోదార్పు అనవసరం. అయినా ఈమె ఇప్పుడు కొత్తగా మా మీద అభిమానం పెంచుకుని మాకు చేయబోయే దేం లేదు.

"మన పొలం నువ్వు చూసుకోలేకపోతే మక్తాకిచ్చేయి, కక్కీ! దాని మీద వచ్చే ఆదాయం చాలు మనకు" అన్నాను. కానీ ఆవిడ ఒప్పుకోలేదు. ఎంత విశ్వాసమున్నా పరాయివాళ్ళు పరాయివాళ్ళేనట. "మన వాళ్ళు అనుకున్న వాళ్ళు ఏం చేశారు?"అన్నాను చిరాకుగా.

"అదీ నిజమేలే" అంది.

కొంచెం కుదుట పడ్డాక ధావన్‌జీ గురించి చెప్పింది.

"ఆ ఆడది నాలా బేల కాదేఁ! వాడి ముక్కు పిండి నానా విధాలుగా పీడించకుంటే నన్ను నువ్వే పేరుతో పిలిచినా పలుకుతా!" అంది ఆయన కొత్త భార్య గురించి చెబుతూ.

మొత్తానికి ధావన్‌జీ మాత్రం మా ఇంటికి రాక పోకలు ఏమాత్రం తగ్గించలేదు. కక్కీమాత్రం ఆయనతో మాటలు బాగా తగ్గించింది. మరో మార్పు. ఇంతకుముందు హాల్లో ఆవిడ కూర్చునీ, ఆయన నిల్చునీ మాట్లాడుకునే వాళ్ళు. కాగా, ఇప్పుడు వాళ్ళు కక్కీ గదిలోనే నిల్చునో కూర్చునో మాట్లాడుకుంటున్నారు. కొన్నాళ్ళయాక తెలిసింది మా పొలం ఇంకా ఆయనే చూసుకుంటున్నారని. "ఆయన కంత కష్ట మెందుకు? తన సొంత భూమేదో తనను చూసుకోమను. మన పొలాలు మక్తాకు ఇచ్చుకోగలం" అన్నా నొకసారి గట్టిగా.


ఆయన విని వెంటనే నా గదిలో కొచ్చి గత నాలుగు సంవత్సరాలుగా తన మూలంగా పంట దిగుబడి ఎలా ఎదిగి పోయిందో నెమ్మదిగా చెప్ప బోయారు. వెంటనే వచ్చింది కక్కీ "ఇదిగో! అది మరీ చిన్నపిల్ల. దాన్తో నీ అడ్డమైన కూతలేమిటి గానీ, నువ్వు ముం దిక్కణ్ణుంచి నడు" అని విదిలించేసింది. చిన్న మొహంతో నా వైపు చూసి వెళ్ళి పోయా రాయన.

సెలవలు సగంలోనే ఉండగానే ఇల్లు బోర్ కొట్టేసింది. ఈ మధ్య కక్కీ పొలానికి వెళ్తోంది. నేనూ రాబోతే వద్దని రభస. "చదువుకునే పిల్లవు ఏ పుస్తకాలైనా చదువుకో. ఈ పొలం గోల నీకు దేనికి?" అనేది నా మాట వినకుండా. కానీ ఆవిడ అంత గట్టిగా పొలం వైపు రావద్దని ఎందుకు చెప్తుందో ఆ తర్వాత అర్థం అయింది. ఒకసారి ఇద్దరు కూలీలు మాట్లాడుకుంటుంటే విన్నాను "ధావన్‌జీ లాంటివాడే అగర్‌వాల్. మరో గుప్తానైనా వేరుగా చూసే చిన్న మనసు కాదావిడది." సీరియస్‌గా ఈ మాటలు అని వాళ్ళు గట్టిగా నవ్వుకున్నారు. "ఈవిడ చచ్చేవరకు మారదు" అనుకున్నాను.

**(ముగింపు వచ్చేవారం)**

(క్రిందటి సంచిక తరువాయి)

**ఒక రోజు** ధావన్‌జీ కారులో ఎవరో కొత్త వాళ్ళతో దిగారు. ఆ రోజు ఉదయమే ఆయనకూ, కక్కీకి మధ్య పెద్ద కొట్లాట జరిగింది. ఇంటి గడప తొక్కవద్దనే వరకూ వెళ్ళింది ఆ వేడి. అది జరిగింది నాలుగు గంట లవలేదు. ఆయన అప్పుడే తయార్! కానీ కార్లోంచి దిగిన ముగ్గురూ చాలా పెద్దవాళ్ళు. మంచీ మర్యాదా అవసరమనుకునే తరహా మనుషుల్లా ఉన్నారు. కక్కీ భర్తకు ఆయన చాలా పాత ఫ్రెండట. తన నంత గుర్తు పెట్టుకుని వచ్చినందుకు పొంగి పోయింది కక్కీ. ఆయన భార్యా, కూతురితో వచ్చారు పెండ్లి పిలుపుకు.





# ఆట

సర్వేపల్లి అపర్ణ

మరో అయిదు రోజుల్లో పెండ్లి కొడుకు పక్కన టన్నుల కొద్దీ సిగ్గు ఒలకబోయనున్న ఆ పంజాబీ పెళ్ళికూతురు ప్రస్తుతం మిడీలో ఉంది. గర్వంగా కనిపించాలని చాలా తాపత్రయ పడుతూంది కానీ, పలకరిస్తే బాగానే మాట్లాడు తూంది. నా చీరనూ, నన్నూ ఏ రాతియుగానికో చెందిన ఫాజిల్సును చూసినట్లు చూసింది. మా ఇల్లు ఆ అమ్మాయికి మ్యూజియంలా అనిపిస్తే నే నాశ్చర్యపోను. పేరు కాంచన్‌ట. ఢిల్లీ లేడీ శ్రీరామ్ కాలేజీలో బి య్యే ఎకనమిక్స్‌తో పూర్తి చేసింది. ''ఎమ్మే చదువుతారా'' అని అడిగితే వోసి మృగమా! అన్నట్లు రెప్ప లార్పకుండా చూసి కాసేపటికి నవ్వించి. ''లేదండీ! మా ఫియాన్స్ ఎందుకు అనవసరమన్నారు'' అంది. మే మంతే మాట్లాడుకుంది. కక్కీ పెళ్ళికి వెళ్లదు. నన్నే తరిమింది.

నిజానికి పెళ్ళి రోజే మా మామిడి తోటలో కాయలు కోయించే పని ఉంది. అనుకుంటే అది ఒక్క రోజుకు వాయిదా వెయ్యడం కష్టం కాదు. కానీ ఆవిడ రాకూడదనుకుంటే రాదు. అంతే!

నేను ధావన్‌జీ కారులోనే ఢిల్లీ వెళ్లాను. పెళ్లి అయిన పక్క రోజుకూడా అక్కడే ఉండవలసి వచ్చింది. వెళ్లిపోతానంటే వాళ్లు విన్లేదు. కాంచన నేను తనతో ఎక్కువమాట్లాడకున్నా— తన ఫ్రెండ్స్ 'కజిన్స్ అంటూ ఎవర్నెవర్నో పరిచయం చేస్తూనే




ఉంది. డోలీ టైములో అంకుల్ కట్నం తాలూకు మొత్తం నీడు లక్షలకు చెక్ పెళ్లి కొడుకు చేతుల్లో పెడుతుంటే ఎందుకో నేను నిలవిల లాడాను. ఆ తరవాత పెళ్ళి కూతురు, పెళ్లి కొడుకు ముందు కార్లో వెళుతుండగా వెనక లారీలో వారి కొత్త సంసారానికి కావలసిన సమస్త వస్తువులూ కదిలాయి. పట్టపగలు పల్లిగ్గా జరిగే దోపిడీ, దగా అనిపించింది. ఆ రోజు సాయంత్రమే నేను బయలుదేరి పాల్వాకు వచ్చేశాను.

కానీ వస్తూనే అస్సలు వూహించని వార్త కక్కీ పరిస్థితేమీ బాగాలేదు. ఏమైంది జలుబుకు కూడా లొంగని మనిషికి ఒక్క రోజులోనే ఆరోగ్యం అంతగా ఎలా పాడైంది. ఉక్కిరి బిక్కిరై పోతూ ఇంట్లో అడుగు పెట్టాను. తలకు కట్లు, మగతగా పడుకుని ఉంది కక్కీ. బిత్తరపోతూ ధావన్ జీ వంక చూశాను. ఆయన భోరుమన్నారు. చుట్టూ మాకు తెలిసిన వాళ్లు ఇంకా వూరి జనం—చాలా మందే ఉన్నారు. కానీ ఎవరి నోటా మాట రానప్పుడు ఎందరుంటే నాకేం కొంచెం సేపటికి తెలిసింది కక్కీ ఉదయం మామిడి తోటలో వెళుతుండగా ఒక కొమ్మ విరిగి తల మీద పడింది. అప్పటినుండీ ఇంతవరకూ స్పృహ రాలేదు.

ధావన్ జీ కదిలిస్తే ఏడవటం తప్ప అసలు విషయం చెప్పడం లేదు. నా కేమిటో అంతా అసహజంగా అనిపించింది. మరో రెండు రోజులు మూగగా బాధ పడుతూనే ఉంది కక్కీ. మగత నుండి తెలిసీ తెలియని స్థితికి వచ్చింది. అస్పష్టంగా ఏవో కేకలు పెడుతుంది. వాటిల్లో ఏదో చెప్పాలన్న తపన జీరగా వినిపిస్తుండేది. ఆమె నలా చూస్తుంటే గుండె కోతగా ఉండేది. 'కక్కీ చచ్చిపోతే!' అన్న ఊహ వస్తేనే ఊపిరి ఆగిపోయేది. భయంగా ఉందని వూహించటం మానెయ్యలేను.

కక్కీ కళ్లు తెరిచి నాతో మాట్లాడాలి తొందరలో అనుకుంటూ గడిపేశాను మరో రోజు. పక్క రోజు ఉదయమే కక్కీ కొంచెంగా కళ్లు తెరిచింది. చాలా సేపు ఆరాటపడి రెండే మాట లంది. ''నీరజా! పింకీ కేమైంది ''అని. నాకు ఏడుపు ఆడుపుకోలేనంత వచ్చింది. ఏడుస్తూనే చెప్పాను. ''వాడికేమీ అవలేదు, కక్కీ! నువ్వే అసలు కళ్లు తెరవట్లేదు'' అని. ఆ తరవాత రెండు మూడు సార్లు రాహుల్ కావాలని కలవరించింది. వెంటనే వాడికి టెలిగ్రాం ఇప్పించాను. ఫ్రెండ్స్‌తో సౌత్ఇండియా టూర్ వెళ్ల బోతున్నాడట. టెలిగ్రాం అందుకుని ఆలస్యం చెయ్యకుండా వెంటనే వచ్చేశాడు.

ఈ సంఘటన గురించి కథలు చెప్పుకుంటున్నారు అందరూ. ''ఒక్కసారిగా కొమ్మెందుకు విరిగి పడుతుంది. గాలికయితే చిన్న కొమ్మలు విరుగుతాయి కానీ మానంత కొమ్మ ఉన్న ఫళాన ఎందుకు నెత్తిన పడుతుంది. ఎవరో చెట్టు మీద కూర్చుని ఆమె వచ్చే సమయానికి అలా పడేలా చేశారు. ఎవరో ఎందుకు చేస్తారు. ధావన్ జీకి మాత్రమే చేత నవుతాయి ఇలాంటి పనులు!'' ఇలా చాలా నోళ్లలో పడి లెక్కలేనన్ని కథలు తయారయాయి. అవి నా ముందుకూ వచ్చాయి. విని నేను చెయ్య గలిగిందేమిటి

అన్నిటికన్నా ప్రపంచంలో నికృష్టమైనది అశక్తత. అంటే రాహుల్ ఎప్పటి లాగా ఆలోచించ కుండానే 'అవును' అన్నాడు. మేము పిలిపించిన డాక్టర్లెవరూ మాకు ఆమె ప్రాణం విషయంలో హామీ ఇవ్వలేదు. ''మహా అయితే మరో ఇరవై రోజులు నెట్టగలరేమో! అంతకంటే మనం ఆశించలేం'' అన్నారో డాక్టర్ ఫిలాసఫికల్‌గా.

నేనూ, తమ్ముడూ బిక్కు బిక్కుమంటూ కక్కీ వైపు చూస్తుంటే చాలామంది మమ్మల్ని గురించి జాలిగా మాట్లాడుకునే వాళ్ళు. దాన్ని భరించలేక రూములోకి పరిగెత్తాను. వెనకే వాడూ వచ్చాడు. నేను సోఫాలో పడి వెక్కి వెక్కి ఏడుస్తుంటే ''ఛీ ఛీ! నువ్వుకూడా ఈ మధ్య కక్కీ లాగే చాలాసార్లు ఏడుస్తున్నావ్'' అన్నాడు. కాదనేందుకు ఏముంది? కక్కీకూడా వెళ్ళిపోతే ఎవ్వరూ లేరని ఏడవాలిసింది నేనే. వాడు కాదు. ఇదంతా వాడికి చెప్పినా అర్థం కాదు.

అప్పటికి ఎనిమిది రోజులైంది కక్కీమంచం పట్టి. ఇంతకు ముందు ప్రతి గదిలో కక్కీ అరుపులూ, కేకలూ సందడిగా వినిపించేవి. ఇప్పుడు ఆవిడ తిరిగిన ప్రతి అంగుళంలోనూ ఎవరెవరో తిరుగుతున్నారు ఆమెను చూడటానికి వచ్చి.

ఆ రోజు కక్కీకి బాగా స్పృహ తెలిసింది. నేనూ, రాహుల్ చాలా సంతోషపడ్డాం. ధావన్ జీకూడా వచ్చి కక్కీ దగ్గరే కూర్చున్నారు. ఒక గంటే అలా ఉంది. మళ్ళీ మగత. మొదట్లో వెర్రిగా కేకలు పెట్టేది. ఆ కేకలకు లోపలకు వచ్చే వాళ్ళను ఆపాలని ధావన్ జీ తలుపులు, కిటికీలు వెంటిలేటర్స్‌తో సహా మూయించేశారు. మేం నలుగురమే లోపల. మళ్ళీ కలవరింతలు మొదలయాయి. ఈ సారి యాతన నాకే! ఒకసారి ఆవిడన్న మాటలతో నా ముఖం పాలిపోతే, ధావన్ జీకి చెమటలు పట్టాయి. రాహుల్ మాత్రం ఆమె మాటలనే జాగ్రత్తగా వింటున్నాడు. కక్కీ అంటూంది ''మా వాడు కాకున్నా అంతకన్నా ఆదరంగా ఇంట చేర్చుకున్నందుకు మా కొంప కూల్చాడులే, వంశీ! (మా నాన్న పేరది). నా చెల్లెలు వెర్రి బాగుల్దని బుట్టలో వేసుకున్నాడు. బిడ్డను కని పిచ్చి ముదిరి అది చచ్చి వూరుకుంది. దాంతో దాని మొగుడు దేశాలు పట్టి పోయాడు. మధ్యలో అందరి పీడా నా కెందు కంటగట్టారు? చెల్లెలుబిడ్డ అనయినా చూడకుండా నీరజాను ఉసురు పెట్టినందుకు ఆ తల్లి పిచ్చి నా కొడుక్కి అంటుకుంది. నన్నే దేవుడు క్షమిస్తాడు రోయ్.'' అంతవరకే విన్నాను. ఈ మాటలు చాలు—నే నెంత చరిత్రహీననో చెప్పేందుకు. కానీ, కక్కీ తనకు కొడుకున్నాడని నా కెప్పుడూ చెప్పలేదు. ఇప్పుడా కొడుక్కు దిక్కెవరని ఏడుస్తూంది. అన్నీ ఉన్నట్లే ఉండి ఏమీ లేని వాళ్ళ కోవలో దీమె. కక్కీ కొడుకును ధావన్ జీ రహస్యంగా పెంచడం ఆ వూళ్ళో వాళ్ళ కథనాల్లో ఒకటి అనుకునే దాన్ని. ఇప్పుడింత దయనీయంగా కక్కీ అది 'నిజం' అని చెబుతూంది.

రాహుల్ అన్నాడు ''మీ అమ్మ ఎవరనీ కక్కీ చెబుతుంది?'' వాడి కామె మాట అంత అర్థమయినట్లు లేదు. ''నే నెప్పుడూ ఆమెను చూళ్ళేదు. నువ్వు దాన్ని గురించి ఇదవకు'' అన్నాను జవాబుగా. ''అలాగనుకుంటే మనం డాడీనికూడా ఎప్పుడూ చూళ్ళేదు. అలా చూస్తే మనం చాలా దురదృష్టవంతులం కదూ!'' అన్నాడు. 'ఇంకెలా చూస్తే అదృష్టవంతులమో' అనుకుని వూరుకున్నాను.

మొత్తానికి కక్కీ అరుపులతో మా కంటే హడలెత్తి పోయిన వాడు ధావన్ జీ. ఆమె దాదాపు హిస్టీరికల్‌గా మారింది. అందుకే ఆయన ఏ క్షణంలో ఏ మరుస్తుందో అని గుండె చేతుల్లో పట్టుకుని మంచం చుట్టూ తిరుగుతుండే వారు.


ఆస్తంతా కక్కీ పేరుమీద ఉంటే ఇంక ఆమె కొడుకు గురించి దిగులెందుకు పడుతూంది? అది అర్థం కాకనే ఆ పత్రాలు తెప్పించాను ధావన్ జీ చేతనే. అయితే ఇందులో చాలా లొసుగు లున్నాయి. ఆ బిడ్డ కక్కీకి భర్త వలన కలగలేదు. రహస్యంగా పెంచబడ్డాడు వగైరాలు. అవన్నీ వదిలేస్తే వీలునామా ప్రకారం కక్కీని కేవలం గార్డియన్‌గానే పెట్టారు

నాన్న. నాకు మైనారిటీ తీరాక కానీ, ఆమె చనిపోయే ముందు కానీ మొత్తం ఆస్తి నాకు చెందాలని షరతు ఉందందులో. కేవలం గార్డియన్ అయినామెను లక్షాధికారిణిగా ఎవరు ప్రచారం చేశారో తెలుసు కునే ఓర్పు నాలో లేదు ప్రస్తుతం.

చావు ముందుకూడా ప్రశాంతి దొరకక కొట్టుకు లాడుతున్న కక్కీని అనుకోవడానికి మనసొప్ప లేదు. ఆమె కొడుక్కు మాత్రం న్యాయం చెయ్యాలను కున్నాను. అతన్ని గూర్చిన వివరాలు ధావన్‌జీకే తెలుసు. ఆయన చెప్పిన దాన్నిబట్టి కక్కీ భర్త పోయిన నాలుగేళ్ళకు అంటే ముప్పై ఎనిమిదేళ్ళప్పుడు ఒక బాబును కనింది ( అప్పుడు నేను అంకుల్ దగ్గర ఉండేదాన్ని ) . అతనికి తండ్రెవరని నే నడగ లేదు. ఇప్పుడా పిల్లవాడికి పదిహేడేళ్ళు. కానీ మెదడు వయసుతో పాటు ఎదగ లేదట. అందుకే ఇప్పటికీ రెండు మూడేళ్ళ బిడ్డ లాగనే తన లోకంలో తనుం టాడు. అలాంటి వాడికి తెలిసి ఆస్తి రాయటం ఎలా? పోనీ రాసినా గార్డియన్‌గా ధావన్‌జీని పెడితే ఆయన అతణ్ని ఆదుకుంటాడని నమ్మకం ఏమిటి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. డాడికి కేబుల్ ఇద్దాం అంటే "అనవసరం" అన్నాడు రాహుల్. "ఆయ నెలాగూ రారు. ఆయన ఇవ్వగల మాత్రం ఉచిత సలహాలు ఇక్కడెవ్వరైనా ఇవ్వగలరు" అని వాడి అభిప్రాయం. అదీ నిజమే! ఎలాగూ ఇప్పుడు ఆస్తి నాదే కనక, నేనే మేజర్‌నే కాబట్టి ఉన్న ఎనభై ఎకరాల్లోనుంచి ఇరవై ఎకరాలు గజేందర్ ( కక్కీ కొడుకు ) పేరుమీద రాసేయాలను కున్నాము.'లా' పాయింట్సు నాకే మాత్రం తెలియవు. ప్రతి చోటా లాయర్ నాకు సహాయ పడ్డారు.

ఆ ఇరవై ఎకరాలకూ ధావన్‌జీ గార్డియన్ లాంటి యజమాని. ఆయన తప్ప మరో దిక్కు లేదు నాకు. ఇన్నాళ్ళూ కక్కీ కొడుకును చూసుకుంది ఆయనే. చికిత్స చేయిస్తూ అతనితో తిరిగి ఎంతో కొంత సేవ చేశారు. అయితే ఒకషరతు పెట్టమని చెప్పాను. దాని ప్రకారం ఆస్తి గజేందర్ పిచ్చి తగ్గి మామూలు మనిషయేదాకా ధావన్‌జీ స్వాధీనంలో ఉంటుంది. తరవాత అతని సొంత మవుతుంది. దీనికి ఆయన ఒప్పుకోలేదు. "మీకూ, మీ ఆస్తికీ శతకోటి నమస్కారాలు. వాడికి పిచ్చి కుదురుతుందో, లేదో భగవంతుడికే తెలీదు. ఈ లోపల నేను హరీ మంటే ఆ ఆస్తి ఎవడికి పోయేట్లు?" అని గోల పెట్టాడు. నిజానికి నా ఉద్దేశ్యం ఆ ఆస్తి ఉంటే ఆయన గజేందర్‌కు ఎంత ఖరీదైనా చికిత్స అయినా ఖర్చుకు వెనకాడకుండా ఇప్పిస్తాడు అని. చివరికి ఆయ నడిగి నట్లే ఆస్తి అయిదేళ్ళలోపు పిచ్చి తగ్గినపక్షంలో గజేందర్‌కు, లేనట్లయితే ధావన్‌జీ వారసులకు చెందేటు రాశాము. కాని, జీవితాంతం అతని పోషణ భారమంతా ధావన్‌జీయే చూడాలి. భూముల మీద వచ్చే ఆదాయం మాత్రం ఆయనకే చెందుతుంది.

ఇన్ని లక్షల ఆస్తి ఏం చేసినా నాశనమై పోతుం దని నాకు తెలిసినా బాధ వెయ్యలేదు. అది మా నాన్న కష్టార్జితం కాదు. ఈ పత్రాల ద్వారా బయట పడ్డ విషయాలను బట్టి చూస్తే అదంతా కక్కీ




మరిదిదే! ( అంటే మా అమ్మ భర్తదాకి) ఆయ్యె నాక సైంటిస్టు. తను చేసిన ఏ ప్రయోగం ఫెయిల్ అయినా ఆ బాధ మరిచిపోయేదాక ఆయన దేశమంతా తిరిగి వచ్చేవాడట. కక్కీ చెప్పేది. అలాంటాయన పాపం, వెర్రి బాగులమ్మాయిని చేసుకుని ప్రయోగాలు చెయ్యబోయి ఫెయిలయి తట్టుకున్నా, తన ప్రమే యం లేకుండానే భార్య తల్లి కావటానికి రీజనింగ్ ఇవ్వలేక అదే పోతగా ఎక్కడికో వెళ్ళిపోయుంటాడు. అలా వెళ్ళే ముందు పోయిన వెలాగూ పోయా యనుకుని ఆస్తికూడా డాడీకి అంట గట్టి పోయుం టాడు. ఏ వంశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం?

ఇది జరిగిన నాలుగు రోజులకు కక్కీ పూర్తిగా కోమాలోకి వెళ్ళిపోయింది. చచ్చి పోయే క్షణం వరకూ ఆమె లోలోపల అలజడి పడుతూ ఉండే దేమో—తన బిడ్డ దిక్కులేని వాడిలా చచ్చిపోతాడేమా నని! నీ కొడుక్కికేం భయం లేదు. కక్కీ అనీ, ఇంకా ఏవేవో చెప్పాలనిపించేది. కానీ ఆమెకు మా మాటలు వినిపించవు. మమ్మల్ని గుర్తుపట్టేస్థితి ఎప్పుడో దాటి పోయింది. మరో వారం రోజులకు కక్కీ చచ్చిపోయింది.

ఈ సారి నా కంటే ఎక్కువగా రాహుల్ ఏడిచాడు. ధావన్‌జీయే కక్కీ శవాన్ని దహనం చేశారు. ఆ తరవాతి రోజు డాడీకి కాల్ బుక్ చేసి మాట్లాడాం. చాలాఫీలయ్యారాయన. "ఇంక మనకుఅడదిక్కంటూ ఎవరూ లేరు, చిల్డ్రన్!" అన్నారు. అది పక్కా అమెరికన్ మేనరిజమ్. విని వూరుకున్నాం. మా ప్లాన్స్ ఏమి టన్నారు. ముందు రాహుల్ బిత్తర పోయాడు. "అదేమిటి, డాడీ! కొలంబియా యూని వర్శిటీ ఎంట్రన్స్ రాయమన్నారుగా. నేను అక్కడికి వచ్చేస్తాను అక్కతో "అన్నాడు. ఏం చెబుతారో నని చాలా ఆసక్తిగా విన్నాను. నన్ను మవుత్ పీస్ దగ్గరికి రమ్మన్నారు. అప్పు డడిగారు "నీ కింకా వన్ ఇయర్ ఉంది కదూ?" అవునన్నాను.

"తరవాతేం చేస్తావ్?"

"జర్నలిజం కోర్స్‌లో చేరాలనుకుంటున్నాను."

"ఆ తరవాత? '

ఈ ప్రశ్నలన్నీ ఒక తండ్రి అడుగుతున్నట్లు లేవు. జవాబు చెప్పాలని అస్సలనిపించ లేదు. కానీ, తప్పదు.

"జర్నలిస్టుగా పేరుతెచ్చుకోవాలన్నది నాఆశయం. ఇంతకు మించి నా కేం ప్లాన్స్ లేవు."

"మరి ఇక్కడికి వస్తే నీ ఫ్యూచర్ పాడవుతుం దేమో."

"అవును. నేను రావాలనుకోవటం లేదు.

"మరో విషయం! నిన్ను అమ్మమ్మా వాళ్ళకు పరిచయం చేస్తాను. యూ నో ప్రెటి వెల్ దట్ అయామేన్ ఇన్‌కాంపిటెంట్ ఇడియట్. మన కమ్యూనిటీలో నీకు మాచ్ సెటిల్ చేయడం నాకు చేతకావి పని. వాళ్ళది గౌరవ ప్రదమైన కుటుంబం. నిన్ను బాగా ట్రీట్ చేస్తారు." ఇంకా ఏం చెప్పేవారో!

నాకు తిక్క రేగి "ఏ అమ్మమ్మా వాళ్ళు మీ భార్య లందరూ నాకు అమ్మలు కారు ' అన్నాను.


రాహుల్ నా చేయి గట్టిగా పట్టుకున్నాడు. ఆయన ఏ మాత్రం హర్ట్ అవలేదు. చిన్న నవ్వుతో "ఓ కే! ఇదంతా నీకు చెప్పిం దెవరు?"అన్నారు.

"ఎవరో ఎందుకు చెబుతారు? మీ బిమ్లాజీ ఎన్ని సార్లడిగినా తన నోటితో ఏమీ చెప్పలేదు— చావుకు ముందు సంధి ఫలవరింతలు తప్ప" అన్నాను కసిగా.

"సో, ఇండిపెండెంట్‌గా బతికేయ గలవన్న మాట! నేను కాదనను. కానీ రాహుల్ అమెరికా వచ్చి నాతోనే ఉంటాడు. నీకు వాణ్ని చూడాలనిపిస్తే నేనే వాణ్ని ఇండియాకు పంపుతాను. విష్ యూ ద వెరీ బెస్ట్! బాబుకు పాస్‌పోర్ట్ మరో నెలరోజుల్లో వచ్చేస్తుందని చెప్పు. గుడ్‌బై" అని ఫోన్ పెట్టే శారు.

అంతే! అదే ఆఖరుసారి నేను నాన్నతో మాట్లాడ టం. తరవాత ఒకటిన్నర నెలకు రాహుల్ అమెరికా వెళ్ళిపోయాడు. వాణ్నికూడా ఆ తరవాతెప్పుడూ చూళ్ళేదు. కలవలేదు నేను. నాన్న జలంధర్‌లో ఉన్న

16–11–83




అంకుల్‌తో మాత్రం నెలకొకసారి మాట్లాడేవారు. ఒకసారి అంకుల్‌ను కలిసేందుకు వెళితే "వంశీతో నువ్వు కటువుగా మాట్లాడావా, డాలీ? వాడు చాలా హర్ట్ అయాడు. నా కూతురు నన్ను ఛాలెంజి చేస్తోంది. నాతో సంబంధం తెంపుకునేందుకు కూడా సిద్ధంగా ఉంది అన్నాడు మొన్న నాతో అన్నారు.

ఏం చెప్పాలి జవాబు నే నేం మాట్లాడినా వాళ్ళకు అన్యాయంగా వినిపిస్తుంది. అలాంటప్పుడు ఏమీ మాట్లాడక పోవడం న్యాయం. డబ్బు విషయంలో మాత్రం నేను కష్టపడకూడదట. ఎంత కావాలన్నా అంకుల్ ద్వారా అడగవచ్చుట. నేనాయనతో మాట్లాడనన్ననాడే తనే నాతో ఉన్న సంబంధాలు తెంపేసుకుంటూ తప్పు నా పైకి తోశారు. నాకు ఇంకెవరూ లేరనుకున్నాను.

అంకుల్‌తో స్పష్టంగా చెప్పేశాను. "మా డాడీ ఈ విషయంలో మమ్మల్నెప్పుడూ అన్యాయం చెయ్యలేదు. ఆయన దయవల్లనే నే నింత నిశ్చింతగా బతుకుతున్నాను. ఆయనకు చెప్పండి. ఇక ముందు నాకు ఒక్క డాలర్‌కూడా ఆయన నుండి అవసర ముండదని. నేను చచ్చిపోయే చివరి క్షణం వరకూ డాడీని ఇందుకే తలుచుకుంటాను. ఆయన నన్నిలా దిక్కులేనిదాన్ని వదిలి నందువల్లనే నాకు ప్రపంచంలో ఒంటరిగా బతకాలంటే భయం పోయింది. పిల్లల్ని తల్లి దండ్రులు పువ్వుల్లా పెంచుతారని వింటూ ఉండటమే కానీ మాకు మాత్రం మా డాడీ ఒక రకంగా ద్రోహం చేసి మరోలా మంచి చేశారు. అన్నిటికీ కలిపి నా థాంక్స్ చెప్పండి" అని.

మమ్మల్ని కలపలేక ఆయన పడే బాధ నా కెప్పుడూ కొత్తగా ఉంటుంది. ఆయనకూ అలా బాధ పడటం ఒక అలవాటు లాంటిది.

అప్పటికే కాలేజీస్ తెరిచి నెల దాటింది. టి సీ తెప్పించుకుని ప్రైవేట్‌గా చదవడం కోసం నాగార్జునా యూనివర్శిటీకి అప్లై చేశాను. ఎగ్జెంప్షన్ గ్రాంట్ అయేసరికి మరో ఆరునెలలు పడుతుందని తెలుసు. పుస్తకాలు కొని చదువులో మునిగిపోయాను.

అప్పుడే తెలిసింది—ధావన్‌జీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారని. ఆయన పొలాన్నిప్పుడు ఆయన భార్య తమ్ముడు చూస్తున్నారు. గజీందర్ పేరు మీదున్న పొలం మాత్రమే ఆయన చూసుకుంటున్నారు. అయితే ఆ పొలంలో నుంచే అయిదెకరాలు అమ్మేశారని తెలిసి నిర్ఘాంత పోయాను. ఆయన్ను పిలిపించి అడిగితే "వాడికి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇప్పించేందుకే అమ్మాను" అన్నారు.

"అదేం ట్రీట్‌మెంట్ ఎక్కడ ఇప్పిస్తున్నారు అస లతనెక్కడున్నాడు అతనికి జరుగుబాటెలా" ఈ రకంగా నేను ఎన్ని ప్రశ్న లడిగినా ఆయన నోట సమాధాన మన దగ్గరేదీ వచ్చేది కాదు. ఆయనకు తెలిసి దల్లా ఒక్కటే మాట" నే నంత దగాకోరును కాదు బేటీ" అని.

ఈయన శాంత స్వభావమేమిటో కానీ, నాకు మాత్రం పిచ్చెక్కినట్లే ఉండేది. కానీ పక్క వూరికి చెందిన పొలం కొన్నవాళ్ళు చెప్పిన కథనం పూర్తిగా వేరు.

"ఆ పిచ్చబ్బాయి ఇంకో సంవత్సరం కంటే బతకడు" అని ఏవో మెడికల్ సర్టిఫికేట్స్ తెచ్చి చూపించాడట. వాటి ప్రకారం అతనికి పిచ్చి కుదిరే ప్రసక్తే లేదు. అంతా మా లాయర్ వూహించినట్లే జరుగుతూంది. అప్పుడే ఆయన ఇదంతా చెప్పినా చేసేది లేక ధావన్‌జీకి కట్ట బెట్టాను అంతా. మళ్ళీ పిలిచి ఇదేమిటని అడిగినా ఆయన నోట్లోంచి మాట రాదు. కక్కీ అప్పు డెందుకలా ఆయన్ను చూడగానే అరిచి కేకలు పెట్టేదో ఇప్పు డర్థమైంది. "అందర్లోకీ నేనూ పెద్ద ఫూల్‌ని" అనుకున్నాను.

పోటీ చేసిన నియోజకవర్గంలో కనీస వోట్లైనా వచ్చి డిపాజిట్ దక్కిం దాయనకు. మరో రెండు నెలలకు మిగిలిన పదిహేను ఎకరాలూ అమ్మేసి ఆయన యెమెన్ వెళ్ళిపోయాడు.

వెళ్ళిన పది హేను రోజులకు నా కొక ఉత్తరం రాశాడు. తను అయిదెకరాలు అమ్మగా వచ్చిన డబ్బును గజీందర్ పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసి దానిమీద వడ్డీ అతనికి అందేలా ఏర్పాటు చేశాననీ, అతన్ని మరొక వూర్లో తన ప్రాణమిత్రుడికి భద్రంగా అప్పగించాననీ చెప్పుకొచ్చాడు. అతను మరో రెండేళ్ళుకూడా బతకడట. అప్పు డనిపించింది. ఈయన కక్కీని చంపించి ఉండడు, ఈనే చంపి ఉంటాడు అని. పైగా మిగిలిన డబ్బుతో తను ఆ అరబ్ కంట్రీలో బిజినెస్ చెయ్యబోతున్నానని రాశాడు.

ఆ తరవాత ఆ ఇంట్లో ఒంటరిగా ఉండాలంటే మనసు పీకేది. ఇల్లు పెద్దదనే కాదు. కక్కీ మరీ ఎక్కువగా గుర్తొచ్చేది. అందుకే పుస్తకాలు తీసుకుని వూరి చివర చిన్న కొండ మీదకు వెళ్ళి కూర్చునే దాన్ని. ప్రకృతిని చూస్తూ కొంతసేపు చదువుకుంటూ మరి కొంత సేపు—ఇలా గడిపి ఇంటికొచ్చేదాన్ని. వచ్చేశాక మళ్ళీ మామూలే! కొన్నాళ్ళకు అదంతా కొంచెం మరిచిపోగలిగాను. పరీక్షలు అయిపోయి ఫలితాలుకూడా వచ్చేశాయి. సెకండ్ క్లాస్ ఇంగ్లీష్ లిటరేచర్ డిగ్రీతో జర్నలిజం కోర్స్ లో చేరాను. ప్రఖ్యాత జర్నలిస్టులు వచ్చి ఇచ్చే లెక్చర్స్, మేము పాల్గొనే సెమినార్స్—వీటన్నిటి మధ్యా కోర్స్ చాలా తొందరగా అయిపోయినట్లు అనిపించింది.

ఆ తరవాత కొన్ని రోజులకే ఒక పెద్ద ఇంగ్లీష్ దినపత్రికలో చేరాను. పేరుకూడా అంత త్వరగానే వచ్చేసింది. నేను మనస్ఫూర్తిగా సంతోష పడ్డ రోజులు అవే నా జీవితంలో. అప్పుడే డాడీకి ఒక ఉత్తరం రాశాను. ఆ రిజిస్టర్డ్ ఉత్తరం 'అడ్రసీ నాట్ అవైలబుల్' అని తిరిగి వచ్చింది కొన్నాళ్ళకు. భయమేసింది. డాడీ ఏమై ఉంటారో అర్థం కాలేదు. డాక్టర్ అంకుల్‌కు ఫోను చేస్తే చెప్పారు—డాడీ ఆరోగ్యం బాగలేనందు వలన స్విట్జర్లాండ్ వెళ్ళారని, రాహుల్ మాత్రం ఆయన ఫ్రెండింట్లో ఉంటున్నాడని. కానీ ఆ తరవాత కూడా నాకు డాడీ గురించి ఎవరూ ఏమీ రాయలేదు.

ఇంకో సంవత్సరంకూడా గడిచిపోయింది సాల్వాలో ఉన్న మా భూములు అన్నీ మక్తాకు ఇచ్చేశాను. ఇల్లుకూడా నా పేరుమీదే ఉంది. నా కెలాగూ ఆ వూరితో ఏ రకమైన బాంధవ్యం లేదు. నా కంటూ అక్కడా ఎవరూ లేరు. ఇంక ఇల్లు మాత్రం ఎందుకు అనుకున్నాను. అందుకే కొనే వాళ్ళుంటే బేరం చెయ్యమని అక్కడి వాళ్ళకు చెప్పొచ్చాను. పంటమీద వచ్చే డబ్బు బాంక్‌లో వేస్తుంటారు. నా కది అనవసరం. నా జీతమే నాకు మిగిలి పోతుంటే దాన్నేం చేసుకోను.

ఇలా పనికే అంకితమై బతికే వాళ్ళుంటే ఎవరికైనా ముచ్చటే! మా చీఫ్ ఎడిటర్ నన్ను పిలిచి ఒకసారి అన్నారు—"ఎప్పుడూ మెషిన్‌లా పని చేస్తుంటావ్! నీకు విశ్రాంతి అక్కర్లేదామ్మా: సెలవు కావాలని ఎప్పుడూ అడిగినట్లే లేదు. నీకు పది రోజులు సెలవు గ్రాంట్ చేస్తున్నా. వెళ్ళి ఎంజాయ్ చెయ్యి" అని. నేను నిజంగా చాలా బాధ పడ్డాను. నాకు టైమ్ ఎలా ఎంజాయ్ చెయ్యాలో తెలియదు. తప్పదన్నట్లు గడపగలను. ఇదంతా ఆయనకు చెప్పలేక "థాంక్స్" చెప్పి వచ్చేశాను. ఒక వారం రోజులు

సాల్వాతో గడపాలని వచ్చాను.

ఇంటి గుమ్మంలో అడుగు పెడుతూనే ఉత్తరం అందించాడు వాత్సవ. అతను నేనులేనప్పుడు ఇల్లు చూసుకుంటూంటాడు. సూట్‌కేస్ లోపల పెట్టించి కవరు తెరిచాను. రాహుల్ రాశాడు. నాన్నను గురించిన ఆదుర్దాలో గబగబా చదివేశాను. కానీ వాడు కొత్తగా వివరాలేం రాయలేదు. నాన్నకు శారీరకమైన అస్వస్థత ఏమీలేదు, మనసులో దిగులు తప్ప. దేని కోసం దిగులు నాకు తెలీదు. రాహుల్‌కి తెలీదు. డాక్టర్స్‌కి తెలీదు. బహుశా మా డాడీకే తెలీదు. మొత్తానికి ఆయన అన్ని బాధ్యతలూ వదిలించుకుని ప్రశాంతత కోసం స్విస్‌లో ఉండిపోయారు.- ఇదే వాడు రాసింది.

తనకు అమెరికాలో ఏ రకంగానూ చదువు సాగ బోవట్లేదట. అందుకే లండన్ వెళ్ళి పోయి అక్కడే సీనియర్ కేంబ్రిడ్జి స్కూలింగ్ పూర్తి చేస్తాడట. 'మా అమ్మమ్మా వాళ్ళతో నేను చాలా కలిసిపోయాను' అని రాశాడు. వాళ్ళు పశ్చిమ జర్మనీలో ఉన్నారట. నాన్నంటేకూడా వాళ్ళకు ఏదో అనురాగం. ఆయనా వాళ్ళను తరచూ కలుస్తుంటారు. స్విట్జర్లాండ్‌కు, జర్మనీకి లండన్ దగ్గరే కనకే వాడలా మనసు మార్చు కున్నాడేమో అనుకున్నాను. ఒకందుకే నవ్వొచ్చింది. వాడు ఇండియాలో ఉన్నప్పుడు ఎప్పుడైనా వాళ్ళ ప్రసక్తి వస్తే మన గ్రాండ్ మా అనేవాడు. ఇప్పుడు మా జీవితాల్లో నాన్న మాత్రమే కామను అని తెలిశాక వాడికలా అనాలనిపించ లేదేమో! ఏమైనా తను సంతోషంగా ఉన్నానని రాశాడు. నాన్నకూడా మరీ ఒంటరిగా ఉండరని తెలిశాక కొంచెం వూరట మనసులో ఎక్కడో! నాకు ఒంటరితనం అంటే చాలా భయం! అది పెట్టే యాతనంటే భయం. కానీ నాకు తెలిసిందల్లా ఒంటరిగా గడపటమే! నన్ను వీలైనంత త్వరలో లండన్ రమ్మని రాశాడు. నన్ను చూడాలనుందట. కానీ నాకు నాన్నను చూడాల నుంది. ఆయన తనకుగా తను నన్ను ఒక్కసారి వచ్చి చూసి వెళ్ళమంటే ఎగిరి వెళ్ళి ఆయన దగ్గర వాలేదాన్ని. అంతకంటే ముఖ్యం కాదు నాకీ వృత్తి. కానీ ఆయ నలా పిలవరు. నేను చెయ్యని తప్పుకు శిక్ష వేస్తారెందుకు? ఎవర్నడగా లివన్నీ? ఈ ఆలోచన మధ్యే రాహుల్ ఉత్తరాన్ని చదవడంతో రోజు పూర్తి అయింది. ఆ రోజు సాయంత్రమే వాత్సవ ఇల్లు కొనాలనుకుంటున్న వాళ్ళ వివరాలు పట్టుకొచ్చాడు.

పక్క రోజే కొంచెం న్యాయంగా ధర అడుగు తున్నారనిపించిన వాళ్ళకు ఇల్లు అమ్మేసేందుకు ఒప్పుకున్నాను. వాళ్ళు డబ్బు రెండు నెలల లోపల ఇస్తామన్నారు. నాకూ తొందర లేదు. రిజిస్ట్రేషన్ మరో వారం రోజులకే అయిపోయింది. కానీ వాళ్ళు చాలా మర్యాదస్తులు. "మీరు పొలం వ్యవహారాలు కోసం ఇక్కడకు వచ్చినప్పుడు ఈ ఇంట్లోనే దిగం డమ్మా. ఎప్పటికీ మీ సొంత ఇల్లే అనుకోండి" అంటూ మాట్లాడారు. నవ్వొచ్చింది.

మరో రెండు రోజులకు ఇంట్లో ఉన్న ఫర్నిచర్‌తో సహా ఢిల్లీ వెళ్ళిపోయాను. జలంధర్‌లో ఉన్న అంకుల్‌ను కలిసి సాల్వాలో ఉన్న భూములు పూర్తిగా రాహుల్ పేరు మీదకు బదిలీ చేయించాలనుందని చెప్పాను. అదీ జరిగిపోయింది. వీలును బట్టి ఆ భూములు అమ్మేసి డబ్బు నాన్నకు పంపేస్తానని ఆ బాధ్యత ఆయనే తీసుకున్నారు. ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బూ, ఇన్ని రోజులూ భూముల మీద వచ్చిన డబ్బు అదంతా బాంక్స్ నుంచి తీసి రాహుల్ పేరుమీద చెక్‌గా రాసి అంకుల్ చేతికే ఇచ్చాను. ఆయనే దాన్ని వాడికి పంపుతానన్నాడు. అంతే! అక్కడితో నాకూ, సాల్వాకూ ఋణం తీరిపోయింది.

ఆ తరవాత నేను పత్రికా రచయిత్రిగా ఇంకా చాలా ఎదిగిపోయాను. రెండు మహిళల పత్రికలకు కన్సల్టింగ్ ఎడిటర్ నయాను. మహిళా విమోచనోద్యమానికి కొత్త నిర్వచనం ఇచ్చానన్నారు. అట్టడుగున మగ్గిపోతున్న జీవితాల గురించి ఎంత రాతి గుండెకైనా లోతులు తాకేట్లు రాస్తా నన్నారు. ఇంకా ఏవేవో! ఇలా నా కంటూ కొన్ని ప్రత్యేకతలుసంపాదించుకున్నప్పుడునలుగు రైదుగురు యువకులు నే నంటే ఆరధన పెంచుకోవటం, ఆ తరవాత తమ జీవితాన్ని పంచుకొమ్మనటం ఆశ్చర్యం వేసే విషయాలు కాదు. కానీ వాళ్ళందరినీ నే నొక్కటే అడిగాను. "నా కంటూ చెప్పుకునేం దుకు ఎవరూ లేరు. కనీసం నా గతంలో ఏముందో మీరు తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తారా" అని. దాదాపు అందరూ 'నో' అన్నారు.

పూర్ చాప్స్! ఆ 'నో' ఒక పెద్ద త్యాగం అంత అనుకుంటే దానికి నే నేం చెయ్యను? ఒంటరి మనసులో ఇన్ని రోజులూ ఉక్కిరి బిక్కిరి అవుతున్న భావాలు దగ్గరి వారితో కూడా పాలు పంచుకోలేకుంటే ఎవరి ముందు చెప్పుకోవాలి గతంలో ఏమీ లేదను కుని, భవిష్యత్తులో వాళ్ళ భార్యగా చిరునవ్వులు చిందిస్తూ అగుపించాలని వాళ్ళ అభిమతం. అది నాకు చేతకాదు.

జీవితాన్ని అతి సులభంగా తీసుకునే వాళ్ళు కొంద రుంటారు. అది వాళ్ళకు పుట్టుకతో వచ్చిన లక్షణం. కానీ వద్దన్నా కొన్ని నిజాలు నన్ను చిత్రహింస పెడ తాయి. అలా బాధ పడటం నా లక్షణం. ఈ చిన్న పాయింట్ వాళ్ళ కర్థం కాలేదు. అందుకే ఒక చిన్న 'సారీ'తో వాళ్ళ కోర్కెల్ని తోసి పుచ్చాను. ఆ తరవాతెప్పుడూ ఒంటరితనం గురించి బాధ పడలేదు. ఎంతమంది కనిపించే తోడున్నా, ఎవరి మనసు వాళ్ళ కెప్పటికీ ఒంటరిదే! ఇది ఎవరు కాదన్నా నా వరకూ నిజం.

ఆ తరవాతకూడా కొన్ని సంవత్సరాలు గడిచి పోయాయి. పేరు తెచ్చుకుంటున్న కొద్దీ చాలా దేశాలు తిరిగాను. కానీ నా వాళ్ళను కలవ లేదు. ఎంతటి విజయానికి కూడా చలించని స్థితికి వచ్చేశాను పేరు ప్రతిష్ఠలు ఎక్కువైన కొద్దీ నా సర్కిల్ చిన్నదై పోయింది. ఆ సర్కిల్‌లోకూడా ఎవరికీ అర్థం కానట్లు ఉండి పోయాను. నా గురించి వాళ్ళకు తెలిసే కొద్దీ నేను వాళ్ళకు అస్సలు అర్థం కాకుండా పోతాను. ఒదొక భయం. అన్ని భయాల మధ్యా చాలా ఫ్రీగా బ్రతికాను. ఇప్పటికీ బ్రతుకు తున్నాను. కాని, నా డాడీ నేనూమాత్రం ఎప్పటికీ కలుసుకోని పెన్ ఫ్రెండ్స్‌లా మిగిలిపోయాం.

(సమాప్తం)

